క్లుప్తంగా

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పోరుమామిళ్ల : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ అభిలాష్ అన్నారు. ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వద్ద ఎంపీటీసీ కల్వకూరి రమణ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు మాత్రమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని రమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, హర్ష, మోహన్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బి.కోడూరు : మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పోరుమామిళ్లలోని చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి, జి.శ్రీకాంత్‌రెడ్డి 1755 నోటుపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. తువ్వపల్లె, సిరిగిరిపల్లె, విజయనగర్ కాలనీ, అమ్మవారిపేట, అయ్యవారిపల్లె, రామసముద్రం, ముస్సెల్లి, గుంతపల్లె, బి.కోడూరు, రామచంద్రాపురం, రాజుపాలెం, రాజుపాలెం దళితవాడ, పేరమ్మగారిపల్లె, బొప్పాపురం దళితవాడ పాఠశాలల్లో చదువుతున్న 585 మంది బాలబాలికలకు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సన్మానం



శారదాదేవిని సన్మానిస్తున్న ఐసీడీఎస్ బృందం

చాపాడు : ఐసీడీఎస్ శాఖలో సూపర్‌వైజర్‌గా శారదాదేవి చేసిన సేవలు ప్రశంసనీయమని ఐసీడీఎస్ సీడీపీఓ సయ్యద్ ముంతాజ్ బేగం పేర్కొన్నారు. ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్ట్ పరిధిలోని బ్రహ్మంగారిమఠం మండల సూపర్‌వైజర్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన శారదమ్మకు సోమవారం చాపాడులోని వైఎస్ కల్యాణ మండపంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిశంకర్, రిటైర్డు సీడీపీఓ సావిత్రమ్మ, సూపర్‌వైజర్‌లు సుబ్బరత్నమ్మ, ప్రవీణ, అంగన్వాడీ వర్కర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

కాశినాయన : ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఎం.రవీంద్రబాబు అన్నారు. సోమవారం నరసాపురం మోడల్ పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధే పరమావధిగా భావించే రాష్ట్రోపాధ్యాయ సంఘంలో సభ్యులుగా చేరి సంఘం బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదును పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, వాకా చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి వీవీ నారాయణ, ఉపాధ్యాయులు ప్రదీప్, ప్రసాద్, రామకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, వెంకటసుబ్బయ్య, ఎం.సుబ్రహ్మణ్యం, పీరుబాషా, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్త కొరత లేని జిల్లాగా మార్చండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు : జిల్లాను రక్త కొరత లేని జిల్లాగా మార్చాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మైదుకూరులో సోమవారం ఆయన రక్తదాన వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఏడు రోజులపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే రక్తదాన శిబిరాల్లో యువతీ యువకులు, రక్తదాతలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, స్వచ్ఛంద సంస్థలకు చెందిన రక్తదాతలు, కార్యకర్తలు ములపాకు నాగేశ్వర్‌రెడ్డి, ఇమ్మిడిశెట్టి సతీష్‌బాబు, నియాజ్, సుబ్బు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భూమిరెడ్డి రవి కళ్యాణ్, జూటూరు విజయ్‌కుమార్, చంద్ర, వాగ్దాడం శివశంకర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కలసపాడు : మండలంలోని ఈ.రామాపురం గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న మూడు బెల్ట్ షాపుల్లో సోమవారం ఎస్ఐ తిమోతి దాడి చేసి 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పి.సుబ్బరాయుడు నుంచి 16, బి.వెంకటరత్నం నుంచి 19, మరొకరి వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, కానిస్టేబుల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాముల ఊరేగింపు





గోపవరం : రాచాయపేటలో పీర్ల స్వాముల ఊరేగింపు, రాజుపాళెం మండలం గోపాయపల్లెలో..



కాశినాయన : వరికుంట్లలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లెలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం పీర్ల స్వాములను ప్రత్యేకంగా పూలతో అలంకరించి భక్తులు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పీర్లకు చక్కెర, బెల్లం చదివించారు. అనంతరం అనంతరం పీర్లను బావికి తరలించారు. కులమతాలకు అతీతంగా ఈ వేడుకలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన పీర్ల పండుగ

గోపవరం : మండలంలోని రాచాయపేటలో గత 5 రోజులుగా నిర్వహించిన పీర్లపండుగ సోమవారంతో ముగిసింది. కులమతాలకు అతీతంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పీర్లపండుగను జరుపుకొన్నారు. సోమవారం తెల్లవారుజామున పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడిచారు. అనంతరం గ్రామంలో పీర్లను ఊరేగించారు. సాయంత్రం పీర్లు బావికి పోవడంతో పండుగ ముగిసింది.

జనసందోహం మధ్య..

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె గ్రామంలో సోమవారం వైభవంగా పెద్దఖాశీం, చిన్నఖాశీం, దమామ స్వాముల పీర్లను ఊరేగించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి సదివింపులు చేసి చక్కెరను పంచిపెట్టారు. తప్పెట్లు, డప్పు వాయిద్యాల నడుమ రంగులు చల్లుకుంటూ ఊరేగింపు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఆదిత్యరెడ్డిలను సత్కరిస్తున్న సూరారెడ్డి

పోరుమామిళ్ల : అట్లూరు మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సూరారెడ్డిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సూరారెడ్డి నాయకత్వంలో అట్లూరు నాయకులు పోరుమామిళ్లకు వచ్చి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని కలశారు. గోవిందరెడ్డికి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డికి పూలమాల వేసి శాలువలతో సన్మానించారు. రాష్ట్ర పదవికి ఎంపిక చేసినందుకు పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డికి సూరారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సిఫారసు చేసిన గోవిందరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి శాలువా, పూలదండతో సూరారెడ్డిని సత్కరించి, మిఠాయి తినిపించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అన్ని వర్గాలను కలుపుకొని పోవాలని సూచించారు. ఆయన వెంట అట్లూరు, గోపవరం మండలాల కన్వీనర్లు ప్రభాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, మాజీ జడ్పీటీసీ రమణయ్య, లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు యర్రబల్లెఓబయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు దేవానందం, జాలాగురయ్య, జయచంద్రబాబు, బాలయ్య, సి.వి.రమణ, సుందరయ్య, జయరాజు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గురుమూర్తి, మైనార్టీ నాయకులు జహంగీర్, దళిత ప్రజా సంఘాల నాయకులు పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్, రంగనాయకులు, ఎల్.జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తవుతున్నా ఇంతవరకు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడం దారుణమన్నారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కార్మికుల కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని, అలాగే ప్రతి మున్సిపల్ కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఈ నెల 11వ తేదీన కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరగబోయే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, గురయ్య, శ్రీనివాసరాజు, ఆదినారాయణ, వెంకటరెడ్డి, దేవా, శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, నరసయ్య, బాబీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పథకాలు ఇవ్వాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ కార్యదర్శి బి.మధు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు ట్రేడ్ల వారీగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు గురుమూర్తి, వెంకటలక్షుమ్మ, రాజేష్, సహాయ కార్యదర్శి ప్రమీలరాణి, నారాయణమ్మ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్

పోరుమామిళ్ల : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపద అంబానీ, అదానీలకు అప్పనంగా అప్పజెప్పటాన్ని ప్రతి కార్మికుడు వ్యతిరేకించాలని అన్నారు. కడపలో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐటీయుసీ నాయకులు సఫా, పీరయ్య, కేశవ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ తెలిపారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. నాలుగు నల్ల లేబర్ కోడ్ చట్టాలు ఎత్తి వేయాలన్నారు. పోరుమామిళ్లలో 9వ తేది ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని, కార్మికులు, ఉపాధ్యాయులు, రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు రేణుకాదేవి, జ్యోతి, రోశమ్మ, సుధా, కళావతి, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

ప్రొద్దుటూరు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అన్వర్ థియేటర్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు మంగళవారం ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు రక్తదాన శిబిరం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్ రెడ్డి సోమవారం తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు మంగళవారం ఉదయం 9 గంటలకు రావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలి

మైదుకూరు : మైదుకూరులో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న తెలిపారు. ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జయంతి కేక్‌ను కట్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు శిక్షణ

గోపవరం : మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10-30 గంటలకు పీఏఐ వెర్షన్ 2.0 పై మండల స్థాయి అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని మండల అభివృద్ధి కార్యాలయ ఏఓ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులతోపాటు సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్ట్

కలసపాడు : మండలంలోని రెడ్డిపల్లె సమీపంలో ఉన్న మేకలకుంట కంపచెట్ల వద్ద పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.59 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని శ్రీకైవల్య సత్సంగ్ ఎంవీఎస్ ధ్యాన మందిరంలో గురుపూజ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కైవల్య తీర్థ స్వామి రచించిన ధ్యాన సూక్ష్మాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జగద్గురు వేదాంత లక్ష్మణార్యుల వారి 50వ ఆరాధన దివ్య స్మృతి సందర్భంగా లక్ష్మణార్యుల జీవిత విశేషాలు, గొప్పతనాన్ని వివరించారు. రాష్ట్రంతోపాటు బెంగళూరుకు చెందిన స్వామివారి శిష్యబృందం పాల్గొన్నారు.

అన్నదానం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని భక్తులకు దాతల సహకారంతో ప్రతి సోమవారం అన్నదానం చేపడుతున్నామని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో సోమవారం స్వామి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో వీరభద్రస్వామి, భద్రకాళిమాత పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, పూర్ణ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో..

ప్రొద్దుటూరు : స్థానిక వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలలో సోమవారం అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్-కువైట్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాయచోటికి చెందిన పున్నపు విష్ణువర్ధన్, లక్ష్మీరోహిణిల కుమారుడు హిమాక్ష్ రాయల్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, మోన్యా బ్యూటీ సెలూన్ కువైట్ అధినేత శివకుమార్, శశికళ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా టీడీపీ నేతలకు భంగపాటు



తల్లికి వందనం పథకం రాలేదని టీడీపీ నేతలను నిలదీస్తున్న మహిళ



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న నంద్యాల రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డులో ఉన్న హనుమాన్ నగర్‌లో సోమవారం మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నేతలకు భంగపాటు తప్పలేదు. ఈ సందర్భంగా అనేక చోట్ల ప్రజలు తమ సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారని నాయకులను నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు అమ్మ ఒడి పథకం వచ్చేదని, ఇప్పుడు కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని పథకం ఆపేశారన్నారు. ఈ సమస్య కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా పరిష్కారం కాలేదని నాయకుల ముందు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాము పేదలమని, ఎందుకు ప్రభుత్వ పథకాలు రావని అన్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని కొందరు తెలిపారు. అలాగే తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్య గురించి పలు చోట్ల ఫిర్యాదు చేశారు. దీంతో నంద్యాల రాఘవరెడ్డి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి అక్కడి నుంచే ఫోన్ చేశారు. వీధుల్లో తిరగడానికి కూడా తమకు ఇబ్బందిగా ఉందని, వెంటనే కాలువలను శుభ్రం చేయించాలని కమిషనర్‌ను కోరారు. నాలుగు రోజుల క్రితం గోపవరం గ్రామ పంచాయతీ యానాది కాలనీలో జరిగిన కార్యక్రమంలో డ్రైనేజీ సమస్యపై టీడీపీ నేతలను ప్రజలను ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాడెం సుధాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బచ్చల వీరప్రతాప్, కుతుబుద్దీన్, బేపారి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటం



జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు బద్వేలులో జరగబోవు సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను సైతం నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ అయిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసగించడం దారుణమన్నారు. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే ఖనిజ నిక్షేపాల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రాకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, ఇమ్మానియేల్, వెంకటరమణ, విజయమ్మ, పట్టణ సహాయ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రజాపక్షం పార్టీ నాయకులు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ అమృతానగర్ ఫేజ్-1, 2లలో 898 ఇంటి స్థలాలు ఖాళీగా ఉన్నందున 2023 జూలై 23న వంద మంది పేద మహిళలకు ఇళ్ల స్థలాల కోసం తమ పార్టీ తరఫున దరఖాస్తు చేశామని తెలిపారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఏడు దఫాలుగా అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు 15 రోజుల్లోగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం, కార్యదర్శి మునిసుబ్బారెడ్డి, ప్రతాప్, ఎస్ఎండీ వలి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఈ నెల 9న బుధవారం చేపట్టే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. స్థానికంగా వారు సోమవారం మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రంలోని పార్టీలు కార్మిక వ్యతిరేక చట్టాలకు మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో తీర్మానించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

మందుల కాల్చివేతపై కలకలం



కాలిపోయిన మాత్రలు, సిరప్‌లు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కాల్షియం, ఐరన్ మాత్రలతోపాటు మరికొన్ని సిరప్‌ల కాల్చివేతపై సోమవారం సాయంత్రం కలకలం రేగింది. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ వైద్య సిబ్బంది పక్కనే ఉన్న చెత్త కుప్పలో మందులను పడేశారు. వాటిని ఎవరైనా చూస్తారని చెత్త కుప్పకు నిప్పంటించి కాల్చారు. అక్కడే ఉన్న స్థానికులు ఈ మందులకు గడువు ముగిసిందా లేదా అని పరిశీలించగా ఇంకా నెల నుంచి 45 రోజుల వరకు గడువు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు, కల్లూరు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు వచ్చి పరిశీలించారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని కల్లూరు వైద్యాధికారి తెలిపారు. మంగళవారం ఉదయం ఈ విషయంపై ఆశ కార్యకర్తలకు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన ఐరన్, కాల్షియం, సిరప్ మందులను సరైన సమయంలో వారికి అందించకపోవడంతో హెల్త్ క్లినిక్‌లో ఉంచుకోవడం వల్ల గడువు ముగిసిందని మందులను కాల్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. మందులను కాల్చకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడిందని ప్రజలు విమర్శిస్తున్నారు.